

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో పలంచ ప్రసాద్

# బీఆర్ఎస్‌లో చేరికలు

హత్నూర, నవంబర్ 17: హత్నూర మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నవీన్‌కుమార్ శుక్రవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సింగాయపల్లి గోపి ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా, మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. హత్నూర మండలం మాధుర గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా మండల మాజీ అధ్యక్షుడు పలంచ ప్రసాద్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌కుమార్, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో నవీన్ కుమార్

# సంగారెడ్డికి మెట్రోరైల్, రింగ్‌రోడ్డు తెస్తా

**బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్, పక్కన టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు

- **సంగారెడ్డి నియోజకవర్గంలో రూ.4.500 కోట్లతో అభివృద్ధి చేశాం**
- **మెడికల్ కళాశాల ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ సర్కారే..**
- **సాంకేతిక విద్యకు ఐటీ హబ్ ఏర్పాటు**
- **సంగమేశ్వర ఎత్తిపోతలతో సాగునీళ్లిస్తాం..**
- **జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం**
- **డంపింగ్ యార్డు, చెత్తశుద్ధి యంత్రాల ఏర్పాటు**
- **అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ఆదరించండి**
- **సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక మ్యానిఫెస్టో**
- **బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్**

సంగారెడ్డి, నవంబర్ 17: 'బీఆర్ఎస్‌తోనే సంగారెడ్డికి మెడికల్ కళాశాల వచ్చింది. కాంగ్రెస్ నాయకులు ఎన్నికలు వస్తేనే ప్రజల ముందుకు వచ్చి మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకునేందుకు క్యూకట్టారు. అలాంటి వారి నుంచి జాగ్రత్తగా ఉండాలి.' అని బీఆర్ఎస్ సంగారెడ్డి అభ్యర్థి చింతా ప్రభాకర్ ప్రజలకు సూచించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధికి 16 అంశాలతో రూపొందించిన ప్రత్యేక మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా ప్రభుత్వం అండదండలతో నియోజకవర్గంలో రూ.4,500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామన్నారు. సీం కేసీఆర్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేయాలని కోరితే, 2018 ఎన్నిక ప్రచారానికి వచ్చినప్పుడు మెడికల్ కళాశాల సంగారెడ్డిలో ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన జగ్గారెడ్డి కేవలం హైదరాబాద్‌కే పరిమితమై ప్రజలను పట్టించుకున్న పాపానపోలేదని విమర్శించారు. అలాంటి నాయకుడు మళ్లీ ఎన్నికలు వచ్చినందున మరోసారి ప్రజలను వంచించి మాయమాటలతో గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందుబాటులో లేని ఎమ్మెల్యేకు ప్రజలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. సాంకేతిక విద్యకు ఐటీ హబ్ ఏర్పాటు చేసి 10వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, ఇటీవల మంత్రి కేటీఆర్ సంగారెడ్డికి వచ్చినప్పుడు ప్రకటించారన్నారు. సంగారెడ్డికి మెట్రోరైలు పరుగులు పెడుతుందని, వచ్చే రెండు, మూడేండ్లలో రైలు కూత వింటారన్నారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలో పంటపొలాలకు నీళ్లందించే పథకానికి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సంగారెడ్డికి ఒకే రోడ్డు ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, గుర్తించి త్వరలో సంగారెడ్డి చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుడతామన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటైన పరిశ్రమల్లో నిత్యం పనిచేసే కార్మికుల కోసం ఈఎస్ఐ దవాఖాన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. సంగారెడ్డి డంపింగ్ సమస్యను శాశ్వతంగా తొలగించేందుకు స్థలం సేకరించామని, సదాశివపేట పట్టణంలో ఇప్పటికే 15 ఎకరాల స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించామన్నారు. సంగారెడ్డిలో డంపింగ్ యార్డుతో చెత్త సేకరణ చేసి, సేంద్రియ ఎరువులు తయారు చేసి పంట పొలాలకు తరలిస్తామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నామన్నారు. రాజీవ్‌పార్కును సుందరీకరణకు నిధులు ఖర్చు చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సంగారెడ్డిలో బీసీ, మైనార్టీల విద్యార్థులకు గురుకుల డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసి మెరుగైన విద్యనందిస్తామన్నారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో మైనార్టీలకు షాదిఖానాలు నిర్మించి, అందుబాటులో తీసుకువస్తామన్నారు. ఆలయాల ఆధునీకరణకు నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. 10వేల మంది పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇండ్లు నిర్మించి పంపిణీ చేస్తామని ప్రకటించారు.

### ప్రజలను వంచించేదే కాంగ్రెస్ పార్టీ

**– టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్**

ఎన్నికలు రాగానే గద్దల్లా ప్రజల ముందు వాలిపోయే నైజం కాంగ్రెస్ పార్టీదని, ప్రజలకు మాయమాటలు చెప్పి, మోసం చేసి గద్దెనెక్కాలనే ప్రయత్నం చేస్తుందన్నారని టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఎన్నికలు రాగానే నియోకవర్గంలో వాలిపోయి ప్రజలను మభ్యపెట్టి గుండాయిజం, బెదిరింపులతో మరోసారి ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకుల మోసాలలో పడిపోవద్దని, వారిని నమ్మితే నట్టేట ముంచుతారన్నారు. గత ఎన్నికల్లో చింతా ప్రభాకర్ ఓటమి చెందినా ప్రజల మధ్యనే ఉంటూ కరోనా కష్ట కాలంలో ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసుకున్నామన్నారు. సంగమేశ్వర ప్రాజెక్టుతో నియోజకవర్గంలో పంట పొలాలు పచ్చగా కనిపించే సమయం వచ్చిందని, సీఎం కేసీఆర్ పనులకు శంకుస్థాపన చేశారన్నారు. సమావేశంలో ఎన్నికల కోఆర్డినేటర్ పట్నం మాణిక్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నాయకులు మామిళ్ల రాజేందర్, శివరాజ్ పాటిల్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, మనోహర్‌గౌడ్, విజయేందర్‌రెడ్డి, నగేశ్, డాక్టర్ శ్రీహరి, గౌరిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, ఎర్రోళ్ల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

**వచ్చే ప్రభుత్వంలో మరిన్ని పథకాలు**

**రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ**



క్రాంతి కిరణ్‌కు ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

అందోల్, నవంబర్ 17: మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. రాష్ట్రాన్ని ఎన్నో ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల కోసం చేసిన అభివృద్ధి శూన్యమని వచ్చే ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమాకి మరిన్ని పథకాలు తీసుకురానున్నామన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలో ఉన్నది ఆర్ఎస్ఎస్ రక్తమని ఆ పార్టీకి ఓటువేస్తే మోసపోతామన్నారు. శుక్రవారం జోగిపేటలో మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి ముస్లిం, మైనార్టీలందరూ కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మైనార్టీల బతుకుల్లో ఎంతో మార్పువచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ వారి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని మరొక్కసారి గెలిపించుకుంటే మన బతుకుల మరింత మెరుగుపడుతాయని, కాంగ్రెస్ మాటలు విని ఆగం కావొద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనార్టీ స్కూళ్లను స్థాపించి వేలాది మంది ముస్లిం బిడ్డలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదన్నారు. మైనార్టీలు నేడు గొప్ప చదువులు చదువుతూ ఉన్నతంగా స్థిరపడుతున్నారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ హయాంలో కులమతాల కొట్లాటలు లేవని, పాతబస్తీ సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్‌లో కుర్చీల కొట్లాట తగ్గలేదని, అందులో సీఎం క్యాండెట్లు ఎక్కువ అని విమర్శించారు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి కోట్ల రూపాయలకు టికెట్లు అమ్ముకున్నారని, ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని, అలాంటి నాయకుడు అందోల్‌కు అవసరమా అని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై విజన్ ఉన్న నాయకుడు క్రాంతి కిరణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీజైపాల్ రెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ అందోల్‌లో క్రాంతికిరణ్ గెలుపు చారిత్రత్మకం కావాలన్నారు.

### మరింత అభివృద్ధి చేస్తా

**– ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్**

ఎల్లవేళలా ముస్లిం సోదరులకు అండగా ఉండే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మరోసారి మీరందరూ అండగా ఉండి అందోల్‌లో సీఎం కేసీఆర్ బలపరిచిన తనను మెజార్టీతో గెలిపించాలని, అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ అన్నారు. జోగిపేటలో రిక్షాకాలనీ, తోల్లబస్తీ గత ఎన్నికల ప్రచారంలో ఎంతో అధ్వానంగా ఉండేవని, తాను గెలిచిన వెంటనే అక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి అక్కడి పరిసరాలు పూర్తిగా మార్చేసినట్లు గుర్తు చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఎంతో అభివృద్ధి సాధించామని, మరోసారి తతను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, స్టేట్ మార్కుఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నారాయణ, మైనార్టీ నాయకులు అర్ఫత్, ఫైజల్, షకీల్, షాబొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మీయ సమ్మేళనం సక్సెస్

జోగిపేటలో నిర్వహించిన మైనార్టీ ఆత్మీయ సమ్మేళనం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. అందోల్–జోగిపేట మున్సిపాలిటీతో పాటు అందోల్, వట్‌పల్లి, అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మునిపల్లి, రాయికోడ్, పుల్కల్, చౌటకూర్ మండలాల నుంచి మైనార్టీ నాయకులు, యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో జోగిపేట– సంగారెడ్డి ప్రధాన రహదారి గులాబీమయమైంది. సమావేశానికి తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# దామోదర రౌడీయిజం ఇంకెన్నాళ్లు.?

**అందోల్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతి కిరణ్**



మునిపల్లి: లోనికుర్దులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

మునిపల్లి, నవంబర్ 17: 'దామోదర రాజనర్సింహ ఇంకెన్నాళ్లు నీ రౌడీయిజం.? అందోల్ ప్రజలను సంతోషంగా ఉండనివ్వవా, ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ సీఎంగా ఉండి అభివృద్ధి చెయ్యలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందోల్ అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక నీ అనుచరులతో రౌడీయిజం చేయించేందుకు సిగ్గు అనిపిస్తాలేదా..?' అని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాజీ ఉప ముఖ్యమంత్రిపై తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం మండలంలోని లోనికుర్దు గ్రామంలో ఇంటింటి ప్రచారం పూర్తి చేసుకుని ఓ హోటల్ వద్ద చాయి తాగుతుండగా అదే గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తూ గొడవకు దిగారు. దీంతో ఎమ్మెల్యేపై దౌర్జన్యానికి దిగిన కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులకు మధ్య తోపులాట జరగడంతో, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ కాంగ్రెస్ నాయకుల గుండాయిజం నశించాలంటూ గ్రామంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ అభివృద్ధి చెయ్యవు, చేస్తుంటే ఓర్వలేక అడ్డుకోవడం ఏమిటని దామోదర రాజనర్సింహను సూటిగా ప్రశ్నించారు. పదేండ్ల నుంచి అందోల్ నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎన్నికలు రాగానే మళ్లీ అందోల్ ప్రజల మధ్య చిచ్చులు పెట్టి గొడవలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. ప్రశాంతంగా ప్రచారం చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులపై దామోదర ఆదేశాలతోనే కాంగ్రెస్ పార్టీ రౌడీలు గొడవకు దిగారని మండిపడ్డారు. దామోదర రాజనర్సింహ రౌడియిజం అంతమయ్యేందుకు 15 రోజులే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాలను అందోల్ నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని ఎన్నికలతో వారు దామోదర రాజనర్సింహకు బుద్ధి చెబుతారన్నారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

దామోదర రాజనర్సింహ రౌడీయిజం, వ్యవహార శైలి నచ్చక కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి స్వచ్ఛందంగా వస్తున్నట్లు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మొగ్దుంపల్లిలో ఇంటింటి ప్రచారంలో భాగంగా చౌటకూర్ మండలానికి చెందిన, మొగ్దుంపల్లికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సమక్షంలో బీఆర్ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతికిరణ్ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాయికుమార్, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి శశికుమార్, యువత విభాగం అధ్యక్షుడు ఆనంద్‌రావు, సీనియర్ నాయకులు శివశంకర్, నవాజ్‌రెడ్డి, చిట్కుల వెంకటేశం తదితరులున్నారు.